బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 01 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4





పాఠకులు, ప్రకటనకర్తలు,
శ్రేయోభిలాషులకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు
- బలగం టీవి సీఈఓ బాలు కాయితీ

# హ్యాపీ న్యూ ఇయర్







**బలగం టీవి, హైదరాబాద్**

నూతన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. వేడుకలు అంతటా అట్టహాసంగా జరిగాయి. అర్ధరాత్రి వరకు ఆడిపాడిన ప్రజలు గడియారంలో 12 మీదకి ముళ్లు వెళ్లగానే కొత్త ఏడాదికి గట్టిగా కేరింతలతో ఘనస్వాగతం పలికారు. ప్రపంచ దేశాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. కొత్త ఆశలు, ఆశయాలతో హ్యాపీ న్యూ ఇయర్ అంటూ యావత్ దేశం 2025కి ఘన స్వాగతం పలికింది. బాణసంచా కాంతి వెలుగుల్లో హైదరాబాద్ వంటి నగరాలు శోభాయమానంగా కాంతులీనుతున్నాయి. 2025కు ఘన స్వాగతం పలుకుతూ సామాన్యుల నుంచి ప్రముఖుల దాకా పరస్పరం న్యూ ఇయర్ విషెు చెప్పుకుని సందడి చేశారు. ఇక తెలుగు రాష్ట్రాల్లో కొత్త సంవత్సర వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. డిసెంబరు 31 మంగళవారం రాత్రి నుంచే ఎక్కడికక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో యువత ఉత్సాహంగా గడిపారు. లైవ్ కాన్సర్ట్‌లు, క్యాంప్ ఫైర్‌లాంటి వాటిలో పాల్గొన్న స్నేహితులతో ఎంజాయ్ చేశారు.



## జనవరి 4న క్యాబినెట్ భేటీ

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జనవరి 4న సాయంత్రం 4గంటలకు సచివాలయంలో జరగనుంది. కొత్త సంవత్సరంలో జరిగే ఈ భేటీలో పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, భూమిలేని పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులు, టూరిజం పాలసీపై చర్చించే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం కిసాన్, ప్రధాన మంత్రి బీమా యోజన పథకంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌కం ట్యాక్స్ చెల్లించే వారు, ఉద్యోగులను దీని నుంచి మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. రైతు భరోసాకు ఇదే విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్న ప్పటికి పలువురు మంత్రులు అభ్యంతరం తెలిపినట్టు సమా చారం. ఈ నేపథ్యంలో రైతు భరోసాపై తీసుకునే నిర్ణయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కొత్త రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి, దరఖాస్తుల స్వీకరణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు సబ్సిడీ రేట్లతో ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరా చేయాలన్న ప్రతిపాదనపై క్యాబినెట్‌లో చర్చించనున్నట్టు సమాచారం. విద్యుత్ కమిషన్, బీసీ డెడికేటెడ్ కమిషన్, ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికలపై చర్చించే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట దేవాలయానికి తిరుమల తరహాలో ప్రత్యేక బోర్డు ఏర్పాటుపై మంత్రిమండలి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట ఆలయానికి పాలక మండలి ఏర్పాటు, నూతన టూరిజం పాలసీపై కేబినెట్ ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది.

## కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

- **అప్పటి వరకు అరెస్టు చేయవద్దని ఉత్తర్వులు**

**బలగం టీవి, హైదరాబాద్**

ఫార్ములా–ఈ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది. ఈ పిటిషన్‌పై వాదనల అనంతరం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. అప్పటివరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని ఆదేశించింది. కేటీఆర్ పిటిషన్‌పై ఇప్పటికే ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. అందులో కేసుకు సంబంధించి పలు అంశాలు పేర్కొన్న ఏసీబీ, నిబంధనలకు విరుద్ధంగా డబ్బు చెల్లించారని కోర్టుకు తెలిపింది. అవినీతి నిరోధక చట్టం, నేరపూరిత కుట్ర సెక్షన్లు పెట్టినట్లు పేర్కొంది. ప్రజాధనం దుర్వినియోగం చేసినందుకు కేటీఆర్‌పై కేసు నమోదు చేశామనని ఏసీబీ తెలిపింది. ఫార్ములా–ఈ ఆపరేషన్స్ సంస్థను ఎఫ్ఐఆర్‌లో చేర్చారా అని అడిగిన హైకోర్టు, ఇందులో ఎవరెవరి మధ్య ఒప్పందం జరిగిందని ప్రశ్నించింది.

విదేశీ సంస్థకు పౌండ్ల రూపంలో రూ.46 కోట్లను చెల్లించారని, ఇందులో ఆర్బీఐ నిబంధనలను పాటించలేదని ఏసీబీ ఆరోపించింది. హెచ్ఎండీఏ నుంచి రూ.10 కోట్లకు మించి చెల్లిస్తే ఆర్థికశాఖ అనుమతి ఉండాలన్న ఏసీబీ, ఎవరి అనుమతి లేకుండానే 54 కోట్లు చెల్లించారని కౌంటర్‌లో పేర్కొంది. కేటీఆర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ లాయర్ సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. ఏసీబీ అధికారులు నమోదు చేసిన సెక్షన్లు ఎఫ్ఐఆంకు వర్తించవని వాదించారు. ఫార్ములా–ఈ కార్ల రేసు నిర్వహణ ఒప్పందంపై పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సంతకం చేశారని తెలిపారు. ఆ శాఖకు మంత్రిగా ఉన్న కేటీఆర్‌ను ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా చేర్చడం తగదని వాదించారు.

కేటీఆర్ ఎక్కడా లబ్ధి పొందలేదని వాదించిన సీనియర్ లాయర్ సిద్ధార్థ్ దవే, అవినీతి జరిగినట్లు ఎక్కడా ఆధారాలు చూపించలేదని తెలిపారు. ఈ మేరకు ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని కోరారు. భోజన విరామం తర్వాత ఏజీ, గతంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న దానకిషోర్ లాయర్ కోర్టుకు వాదనలు వినిపించారు. ఏసీబీ తరపున వాదనలు వినిపించిన ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి, ఈ–కార్ల రేసింగ్ సీజన్–10 ఒప్పందానికి ముందే చెల్లింపులు చేశారని తెలిపారు. రూ.46 కోట్లను బ్రిటన్ పౌండ్ల రూపంలో చెల్లించారని వివరించారు. ఈ క్రమంలో దర్యాప్తు ఏ దశలో ఉందని అడ్వకేట్ జనరల్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఫిర్యాదుదారు దానకిషోర్ వాంగ్మూలం సేకరించినట్లు ఏజీ తెలిపారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారా అని హైకోర్టు ప్రశ్నించింది. నిందితులు పిటిషన్లు దాఖలు చేయలేదని చెప్పిన అడ్వకేట్ జనరల్, కేసులో ఇప్పటివరకు ఎవరిని అరెస్టు చేయలేదని కోర్టుకు తెలిపారు. కేసు దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉందని, అన్ని ఆధారాలు బయటపడతాయని ఏజీ తెలిపారు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని వివరించారు.

దానకిశోర్ తరపున సీనియర్ న్యాయవాది మోహన్‌రెడ్డి హైకోర్టుకు వాదనలు వినిపించారు. మంత్రి పర్యవేక్షణలోనే పురపాలకశాఖ అధికారులు విధులు నిర్వహిస్తారని, రేసింగ్‌కు చెల్లింపుల దస్త్రాన్ని అప్పటి మంత్రి కేటీఆర్ ఆమోదించారని న్యాయవాది కోర్టుకు తెలిపారు. రేసింగ్ అంశంలో అన్నిరకాలుగా నిబంధనలు ఉల్లంఘించారని వివరించారు. ఈ నేపథ్యంలో ఇరువురి వాదనలు విన్న హైకోర్టు కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై తీర్పును రిజర్వు చేసింది. తీర్పు ఇచ్చేవరకు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది.






## సంక్రాంతికి 6432 ప్రత్యేక బస్సులు

- **సొంతూళ్లకు వెళ్లే వారి కోసం టీజీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు**
- **557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం: టీజీఎస్‌ఆర్టీసీ**

**బలగం టీవి, హైదరాబాద్**

సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారి కోసం టీజీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు 6432 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. ఇందులో 557 సర్వీస్‌లకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. జనవరి 9 నుంచి 15 వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు సంస్థ తెలిపింది. తమ ప్రయా ణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని సూచించింది. ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040–69440000, 040–23450033 సంప్రదించాలని సూచించింది.

## సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు కార్పొరేట్ హంగులు



- **రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారికి సకల సౌకర్యాలు**
- **రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాల యాలను కార్పొరేట్ హంగులతో అధునా తనంగా నిర్మించ బోతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాల యంలో జిల్లా రిజిస్ట్రార్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాకు పెద్ద మొత్తంలో ఆదాయాన్ని అందిస్తున్న ఈ శాఖను మరింత పటిష్ట పరచాలని అధికారులకు సూచించారు. రిజిస్ట్రేషన్లకు వచ్చేవారికి కూర్చోవడానికి కనీసం కుర్చీలు కూడా లేకపోవడంతో చెట్ల కింద, నీడ దొరికిన చోట నిరీక్షిస్తున్నారనీ, ఇకపై ఆ పరిస్థితి ఉండకూడదని అన్నారు. "రాష్ట్రంలో మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులున్నాయి. వీటిలో 38 ఆఫీసులు మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయి. మిగతా 105 ఆఫీసులు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 52 చోట్ల ఆఫీసులకు అవసరమయ్యే భవనాల నిర్మాణానికి ప్రభుత్వం భూమి కేటాయించింది" అని మంత్రికి అధికారులు వివరించారు. భూములు సిద్ధంగా ఉన్న చోట వీలైనంత త్వరగా మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసులను నిర్మించాలనీ, మిగతా 52 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సరిపడే స్థలాలను అన్వేషించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. మొదటి దశలో సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్ కార్యాలయాలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఫోర్త్ సిటీలో, గండిపేట, శేరిలింగంపల్లి, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు మూడు సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాలను గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) కార్యాలయంలో నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లాకు సంబంధించి బంజారా హిల్స్, ఎస్ఆర్‌నగర్, గోల్కొండ సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాలను షేక్ పేట్ ప్రాంతంలో ఒకేచోట నిర్మించేందుకు నిర్ణయించామని తెలిపారు. సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిని నిర్మూలించేం దుకు వీలుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను తక్షణమే రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామరెడ్డి, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్, రంగారెడ్డి హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బువ్వకోసం బిడ్డలా ఏడ్పులా..

- **ఇది పాలకుల పాపమే**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.**

**బలగం టీవి, హైదరాబాద్**

కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిన తెలంగాణ రాష్ట్రంలో పట్టెడన్నం కోసం పసిబిడ్డల ఆర్తనా దాలా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అన్నపూర్ణ నా తెలంగాణలో.. బువ్వకోసం బిడ్డల ఏడ్పులా? అంటూ ప్రశ్నించారు. పైడి రాకేష్ రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న ఆర్మూర్ నియోజక వర్గంలోని ఓ గురుకుల విద్యార్థినులు తమకు సరిగా అన్నం కూడా పెట్టడం లేదని కన్నీరుమున్నీరు అయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా.. కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.

'అన్నపూర్ణ నా తెలంగాణలో బువ్వకోసం బిడ్డల ఏడ్పులా?. కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిన నా తెలంగాణలో పట్టెడన్నం కోసం పసిబిడ్డల ఆర్తనాదాలా?. దశాబ్దాల కాంగ్రెస్ పాలన మూలంగా ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలు, అంబలి కేంద్రాలకు నిలయమైన తెలంగాణను పదేళ్ల కేసీఆర్ గారి పాలనలో దేశానికే అన్నపూర్ణగా నిలిపాం. ఏడాది కాంగ్రెస్ పాలనలో అన్నమో రామచంద్రా అని ఆకలికేకలా?. పదేళ్ల కేసీఆర్ పాలనలో గురుకులాల్లో చదువుకుని ఎవరెస్ట్ శిఖరాలు అధిరోహించి, వందశాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటిన విద్యార్థులు.. నేడు గుప్పెడన్నం కోసం గుండెలవిసేలా రోదించడమా?. సిగ్గు సిగ్గు, ఇది పాలకుల పాపం.. విద్యార్థులకు శాపం, జాగో తెలంగాణ జాగో' అని కేటీఆర్ పేర్కొన్నారు.

## సుడాన్ బాబుకు పునర్జన్మనిచ్చిన నీలోఫర్ వైద్యులు

**బలగం టీవి, హైదరాబాద్**

సుడాన్ దేశానికి చెందిన ఓ పసి బిడ్డకు నగరంలోని నీలోఫర్ హాస్పిటల్ వైద్యులు పునర్జన్మను ప్రసాదించారు. సుడాన్ దేశానికి చెందిన దంపతులు ఐవీఎఫ్ ద్వారా బిడ్డకు జన్మనిచ్చేందుకు ఏడాది క్రితం హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడి ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో ఐవీఎఫ్ చేయించుకోగా, నెల రోజుల క్రితం సుడాన్ మహిళ బాలుడికి జన్మనిచ్చారు. బాబుకు పుట్టుకతోనే బ్లడ్ ఇన్ఫెక్షన్, బ్రెయిన్ ఇన్ఫెక్షన్ ఉన్నట్టుగా డాక్టర్లు గుర్తించారు. ఊపిరితిత్తుల్లోనూ సమస్య ఉన్నట్టుగా తేల్చారు. బాబు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఆరు రోజుల పాటు ఐసియులో ఉంచి చికిత్స అందించారు. సుడాన్ దంపతుల వద్ద డబ్బులు పూర్తిగా అయిపోవడంతో, బాబును నీలోఫర్ ఆసుపత్రికి పంపించారు. ఆ బాబును అడ్మిట్ చేసుకున్న నీలోఫర్ డాక్టర్లు, నెల రోజుల పాటు పూర్తి ఉచితంగా చికిత్స అందించారు. బాబు తల్లిదండ్రులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. బాబు పూర్తిగా కోలుకోవడంతో మంగళవారం డిశ్చార్జ్ చేశామని నియోనెటలజిస్ట్ డాక్టర్ స్వప్న తెలిపారు. తన బిడ్డకు బతికించిన డాక్టర్లకు సుడాన్ మహిళ కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇప్పటికే 5 సార్లు అబార్షన్ అయిందని, ఎన్నో ఏండ్లు పిల్లల కోసం తపించామని ఆమె తెలిపారు.



## అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా

**బలగం టీవి, హైదరాబాద్**

అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝూలిపించింది. మంగళవారం సుమారు 9 ఎకరాల 7గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నది. హైడ్రా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని ఖాజాగూడ, నానక్‌రాంగూడ మధ్యనున్న భగీరథమ్మ చెరువు 35 ఎకరాల వరకు ఉంటుంది. సర్వే నెంబర్ 18లో కొందరు వ్యక్తులు చెరువు బఫర్ జోన్‌లో ఆక్రమ నిర్మాణాలు చేపట్టి తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేశారు. ఇటీవల స్థానికులు ఈ విషయంపై హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో హైడ్రా అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి, ఆక్రమణలు నిజమేనని నిర్ధారించి, అక్కడి వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు ఇచ్చిన 24 గంటల్లోనే కూల్చివేతలు చేపట్టారు. మంగళవారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకున్న హైడ్రా సిబ్బంది.. జేసీబీల సాయంతో చెరువుపై ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. హైడ్రా సిబ్బందిని అడ్డుకునేందుకు వ్యాపారులు యత్నించినా సిబ్బంది తమ కూల్చివేతలను కొనసాగించారు. కూల్చివేతలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. నాలుగు ఎకరాల్లో 20కి పైగా దుకాణాలను తొలగించారు. అయితే ఖాజాగూడ కూల్చివేతల వద్ద తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఎన్నో ఏండ్లుగా ఉన్న తమ నిర్మాణాలు ఎలా కూల్చివేస్తారంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. హడావుడిగా కూల్చివేతలు చేసి తమను రోడ్డు మీద పడేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణాల్లోని సామానులను తీసుకునే సమయం కూడా ఇవ్వలేదని బాధితులు వాపోయారు. కూల్చివేతల క్రమంలో దుకాణాల్లో ఉన్న ఫ్రిజ్‌లు, టీవీలు, విలువైన సామగ్రి ధ్వంసమయ్యాయి.

## కేటీఆర్ మాటలు బాధాకరం : దిల్‌రాజు



**బలగం టీవి, హైదరాబాద్**

అనవసర వివాదాల్లోకి తెలుగు చిత్ర పరిశ్రమను లాగి, పరిశ్రమకు లేనిపోని రాజకీయాలను ఆపాదించొద్దని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ను తెలంగాణ ఫిల్మ్ ఫెడరేషన్ ఛైర్మన్ , నిర్మాత దిల్ రాజు కోరారు. మీ రాజకీయ దాడి, ప్రతిదాడులకు దయచేసి పరిశ్రమను వాడుకోవద్దని హితవు పలికారు. ఇటివల చిత్ర పరిశ్రమ సమావేశంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యల స్పందిస్తూ, ఆయన మాటలు చాలా బాధాకరం అని అన్నారు. ఈ మేరకు ఎఫ్ డి సి ఛైర్మన్ హెూదాలో ఆయన ఒక లేఖ విడుదల చేశారు. సీఎంతో జరిగిన సమావేశం ఒకరిద్దరితో చాటుమాటున జరిగిన వ్యవహారం కాదని అందరికీ తెలిసిందేనని ఆయన అన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ బాగోగుల గురించి అత్యంత స్నేహపూర్వకంగా, ఎలాంటి దాపరికాలు లేకుండా జరిగిన ఈ సమావేశం పట్ల తెలుగు చిత్ర పరిశ్రమ చాలా సంతృప్తిగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పయనంలో తెలుగు చిత్ర పరిశ్రమ భాగస్వామ్యాన్ని గుర్తించి.. రాష్ట్రాభివృద్ధికి, సామాజిక సంక్షేమానికి, మా బాధ్యతగా తగిన సహకారం అందజేయాలని సీఎం కాంక్షించారని అన్నారు.

## జనవరి 2 నుంచి టెట్ పరీక్షలు

**బలగం టీవి, హైదరాబాద్**

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టిజి టెట్) 2024 పరీక్షలు గురువారం(జనవరి 2) నుంచి ప్రారంభం కానున్నాయి. 17 జిల్లాల్లో 92 పరీక్షా కేంద్రాలలో కంప్యూటర్ బేస్డ్ విధానంలో టెట్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి పది రోజుల పాటు 20 సెషన్లలో టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు టిజి టెట్ చైర్మన్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఇవిఎన్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు రెండో సెషన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి రోజు తొలి సెషన్‌కు ఉదయం 7.30 గంటలకు, రెండో సెషన్‌కు 12.30 గంటలకు అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రెండోసారి నిర్వహిస్తున్న టెట్ పరీక్షకు మొత్తం 2,75,773 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పేపర్ 1కు 94,327 దరఖాస్తులు రాగా, పేపర్ 2కు 1,81,426 దరఖాస్తులు వచ్చాయి. ఏమైనా సమస్యలు ఉంటే అభ్యర్థులు 7032901383, 9000756178,7075088812, 7075028881,7075028882, 7075028885 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం

**బలగం టీవీ, హైదరాబాద్**

హైడ్రాపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖాజాగూడ బ్రాహ్మణకుంటలో ఆక్రమణల తొలగింపులో హైడ్రా వ్యవహరించిన తీరుపై తీవ్రంగా స్పందించింది. నోటీసులు జారీ చేసి కనీసం 24 గంటలు కూడా గడవకముందే కూల్చివేతలు చేపట్టడమేమిటని అసహనం వ్యక్తం చేసింది కూల్చివేతలపై హైడ్రా కమిషనర్‌కు గతంలో స్పష్టంగా చెప్పినప్పటికీ అదే విధంగా వ్యవహరిస్తున్నారని, ఇలాగే వ్యవహరిస్తే మరోకసారి కోర్టుకు పిలిపించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టారంటూ ఖాజాగూడలో హైడ్రా మంగళవారం నిర్మాణాలను కూల్చివేసింది. దీనిని సవాల్ చేస్తూ మేకల అంజయ్య, మరికొంతమంది హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ కె.లక్ష్మణ్ విచారించారు. విచారణ సందర్భంగా నోటీసులు ఇచ్చిన 24 గంటల్లోపే కూల్చివేసినట్లు హైకోర్టు గుర్తించింది. 24 గంటలే సమయం ఇస్తే ఎలా? నోటీసులు జారీ చేసిన బాధితుల వివరణ తీసుకోకుండా కూల్చివేతలు ఎలా చేపడతారని హైకోర్టు ప్రశ్నించింది. ఆక్రమణల తొలగింపుకు సంబంధించి చట్ట ప్రకారమే చర్యలు తీసుకోవాలని హైడ్రాను ఆదేశించింది. మరోసారి నోటీసులు ఇచ్చి... పిటిషనర్ వివరణ తీసుకున్నాక చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.



## మన్మోహన్ సింగ్‌కు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్ నివాళి

**బలగం టీవి, హైదరాబాద్**

మాజీ ప్రధానమంత్రి, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మృతి పట్ల బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు మన్మోహన్ సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఢాకాలోని భారత హైకమిషన్‌ను సందర్శించిన యూనస్.. అక్కడ మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. అనంతరం అక్కడి సంతాప పుస్తకంలో సంతాప సందేశాన్ని కూడా రాశారు.

# నూతన సంవత్సర వేళ ప్రభుత్వానికి కేసీఆర్ కీలక సూచన

**బలగం టీవి, హైదరాబాద్**

ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. 2025 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని, సుఖశాంతులతో జీవించాలని కేసీఆర్ ఆకాంక్షించారు. కాల ప్రవాహంలో ఎదురొచ్చే మంచి చెడులు, కష్ట సుఖాలను సమానంగా స్వీకరించే స్థితప్రజ్ఞతను అలవర్చుకుంటూ ఆశావహ దృక్పథంతో తమ జీవితాలను చకదిద్దుకోవాలని అభిలషించారు. నూతన సంవత్సరంలో ప్రజల జీవితాల్లో గుణాత్మకమైన మార్పులు సాధించడం ద్వారానే పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు.

# న్యూఇయర్ లింక్స్ పట్ల జర భద్రం

**బలగం టీవి, హైదరాబాద్**

న్యూఇయర్ పేరుతో వచ్చే లింక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు సూచించారు. 2025 కొత్త ఏడాది నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు న్యూఇయర్ పేరుతో లింక్స్‌ను పంపించి ఓపెన్ చేయమని చెప్పే ఆస్కారం ఉంటుందని, అలాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అనుమానాస్పద లింక్స్‌పై క్లిక్ చేయవద్దని సూచించారు. అవగాహన లేకుండా లింక్స్‌ను క్లిక్ చేస్తే మోసపోతారని హెచ్చరించారు. తెలియని లేదా కొత్త నెంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని హెచ్చరించారు. కొత్త ఏడాదిని ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని పోలీసులు సూచన చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగేలా, ఇతరుల మనోభావాలు రెచ్చగొట్టేలా కార్యక్రమాలు చేయవద్దన్నారు. పోలీసు కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తులో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## నేటి నుంచి సచివాలయ ఉద్యోగులకు ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్..

**బలగం టీవి, హైదరాబాద్**

ఉద్యోగుల సమయపాలనపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ హాజరు ప్రక్రియకు నిర్ణయించింది. దీంతో సచివాలయ ఉద్యోగులకు బుధవారం నుంచి ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరు నమోదు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో ప్రస్తుతం నాల్గో తరగతి ఉద్యోగుల నుంచి ఏఎస్ఓలు, సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్రటరీలు, డిప్యూటీ సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, అడిషనల్ సెక్రటరీల వరకు దాదాపు 4వేల మంది పని చేస్తున్నారు. ఐఏఎస్‌లు మినహా అందరికీ ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేయనున్నారు.

## న్యూ ఇయర్ వేళ డ్రగ్స్ పట్టివేత

**బలగం టీవి, హైదరాబాద్**

కొత్త సంవత్సర వేడుకల వేళ హైదరాబాద్‌లో డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. మాసబ్ ట్యాంకు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ కేసు వివరాలను ఇన్స్పెక్టర్ పరుశురాం తెలిపారు.బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని అమృత వ్యాలీ అపార్ట్మెంట్ లో ఉంటున్న ఓ డ్రగ్స్ వ్యాపారిని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించి 30 గ్రాముల కొకైన్, ఆరు గ్రాముల ఎండీఎంఏ ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 8 లక్షల 25000 ఉంటుందని సీఐ తెలిపారు. వ్యాపారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. టాస్క్ ఫోర్స్ టీం సహాయంతో ఈ దాడులు చేసినట్టు వెల్లడించారు.

# యెమెన్‌లో భారతీయ నర్సుకు మరణశిక్ష

**బలగం టీవి, హైదరాబాద్**

యెమెన్‌లో ఓ హత్యానేరంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న భారతీయ నర్స్ నిమిష ప్రియాకు ఆ దేశాధ్యక్షుడు రషీద్ అల్ అలిమి మరణశిక్ష ఖరారు చేశారు. కేరళకు చెందిన ఈ నర్సును విడిపించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నట్టు కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ఓ హత్యానేరంపై దాదాపు 2017 నుంచి ఆమె యెమెన్ జైల్లో మగ్గుతోంది. కొన్ని నెలల్లోనే ఆమెకు మరణశిక్షను అమలు చేయనున్నట్టు తెలుస్తోంది. తాజాగా ఈ అంశంపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పందించారు. " ప్రియాను కాపాడేందుకు ఆ కుటుంబం అన్ని అవకాశాలను అన్వేషించడాన్ని అర్థం చేసుకోగలం.. ఈ విషయంలో భారత ప్రభుత్వం కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తోంది " అని పేర్కొన్నారు.



నిమిషప్రియా నర్స్ కోర్సు పూర్తి చేసిన తరువాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరింది. 2011లో కేరళకు వచ్చి థామస్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. ఆ తర్వాత యెమెన్‌లో ఓ క్లినిక్ తెరవాలనుకుంది. కానీ ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక వ్యక్తి వ్యాపార భాగస్వామ్యం తోనే అది సాధ్యమవుతుంది. దీంతో అక్కడి తలాల్‌అదిబ్ మెహది అనే వ్యక్తిని నిమిషథామస్ జంట తమ వ్యాపార భాగస్వామిగా చేసుకొని అల్ అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత తన కుమార్తె కు సంప్రదాయ వేడుక కోసం భారత్ వచ్చిన ప్రియా అది ముగియగానే తిరిగి యెమన్ వెళ్లి పోయింది. ఆమె భర్త, కుమార్తె మాత్రం కేరళలో ఉండిపోయారు. మెహది దీనిని అదునుగా భావించి ఆమెనుంచి డబ్బు లాక్కోవడంతోపాటు వేధించినట్టు ప్రియా కుటుంబం ఆరోపిస్తోంది. ఆమెను తన భార్యగా మెహది చెప్పుకోవడం మొదలుపెట్టి , పాస్‌పోర్ట్, ఇతర పత్రాలను లాక్కొన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి.చివరికి ఆమెను కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడనీయలేదు. 2016లో అతడిపై ప్రియా పోలీస్‌లకు కూడా ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. దీంతో 2017లో మెహదీకి మత్తుమందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని భావించింది. కానీ ఆ డోస్ ఎక్కువ కావడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పారేసింది. చివరికి అక్కడ నుంచి సౌదీకి వెళ్లిపోతుండగా సరిహద్దుల్లో ఆమెను అరెస్టు చేశారు. మృతుడి కుటుంబానికి కొంత మొత్తం పరిహారం చెల్లిస్తే నిందితులను క్షమించి వదిలేసే అవకాశం యెమెన్‌లోఉంది. దీంతో ప్రియా కుటుంబం దాదాపు 40 వేల డాలర్లను (రూ. 34,20,000 ) మెహది కుటుంబానికి ఇచ్చేందుకు సమీకరించింది. బాధితుడి కుటుంబంతో చర్చలు జరిపేందుకే భారత దౌత్య కార్యాలయం ఏర్పాటు చేసిన న్యాయవాది అబ్దుల్ అమిర్ 20 వేల డాలర్లు డిమాండ్ చేశాడని నిమిష ప్రియా తల్లి ప్రేమకుమారీ ఆరోపించారు. దీంతో చర్చలు మధ్యలోనే ఆగిపోయాయి.

## శ్రీతేజ్‌కు మంత్రి సీతక్క పరామర్శ

**బలగం టీవి, హైదరాబాద్**

సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను మంగళవారం మంత్రి సీతక్క పరామర్శించారు. శ్రీతేజ్‌కు చికిత్స అందిస్తున్న డాక్టర్లతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకుని భావోద్వేగానికి గురయ్యారు. శ్రీతేజ్ తండ్రికి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రిమాట్లాడారు. సినిమా విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి మరణించడం అత్యంత బాధకరమన్నారు. ప్రస్తుతం శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి కొంత మెరుగుపడిందన్నారు. వెంటిలేటర్ చికిత్స నుంచి శ్రీతేజ్ బయటకు వచ్చాడన్నారు. శ్రీతేజ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు మహిళా శిశు సంక్షేమశాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించి శ్రీతేజ్‌కు అందుతున్న చికిత్సను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు వెల్లడించారు. డాక్టర్లు స్పెషల్ కేర్ తీసుకుని మెరుగైన చికిత్సను అందించాలని ఆదేశించామన్నారు. శ్రీతేజ్ త్వరగా కోలుకుని బయటకు రావాలని కోరుకుంటున్నామన్నారు. శ్రీతేజ్ ప్రాణాలను కాపాడేందుకు ఇటు ప్రభుత్వం.. అటు డాక్టర్లు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. శ్రీతేజ్ త్వరగా కోలుకుంటాడన్న ఆశతో ఉన్నామని, నూతన సంవత్సరంలో చిన్నారి శ్రీతేజ్ ఆరోగ్యవంతుడై వస్తాడన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు.

## కొత్త సంవత్సరం రోజున కేటీఆర్‌ను బాధ పెట్టవద్దు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

ఫార్ములా ఈ-కార్ కేసుకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పెట్టుకున్న క్వాష్ పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు విచారించి తీర్పును రిజర్వ్ చేసింది. తీర్పు ఇచ్చేంత వరకు కేటీఆర్ ను అరెస్ట్ చేయవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ... కొత్త సంవత్సరం రోజున కేటీఆర్ ను బాధ పెట్టవద్దని ఎద్దేవా చేశారు. న్యూ ఇయర్ ను ఎంజాయ్ చేయనివ్వాలని చెప్పారు. ఒక రెండు రోజులు ఎంజాయ్ చేయనిద్దామని... జనవరి 3, 4 తేదీల్లో కేటీఆర్ గురించి చూద్దామని వ్యాఖ్యానించారు.నల్గొండ జిల్లా ప్రజల దశాబ్దాల కల ఎస్ఎల్బీసీ ప్రాజెక్ట్ అని కోమటిరెడ్డి చెప్పారు. 4 లక్షల ఎకరాలకు ఈ ప్రాజెక్ట్ నీరు ఇస్తుందని అన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కాంట్రాక్టర్లు పని చేయరని... కాంట్రాక్టర్లు పని చేయకపోతే మంత్రికి చెప్పాలని సూచించారు. అధికారులు సీరియస్ గా పని చేస్తే ప్రాజెక్టును అనుకున్న సమయానికి పూర్తి చేయవచ్చని చెప్పారు. ఎస్ఎల్బీసీ ఒక వరల్డ్ వండర్ అని... ఇది పూర్తయితే ప్రపంచమంతా వచ్చి చూస్తుందని అన్నారు.

# బెంగాల్‌కే సంతోశ్ ట్రోఫీ

**బలగం టీవి, హైదరాబాద్**

దేశవాళీ ఫుట్‌బాల్ టోర్నీ సంతోశ్ ట్రోఫీని పశ్చిమ బెంగాల్ రికార్డు స్థాయిలో 33వ సారి గెలుచుకుంది. మంగళవారం నగరంలోని జీఎంసీ బాలయోగి అథ్లెటిక్స్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో బెంగాల్.. 1-0తో మాజీ చాంపియన్ కేరళను ఓడించింది. నిర్ణీత సమయానికి ఇరు జట్లూ గోల్ చేయడంలో విఫలమయ్యాయి. అయితే అదనపు సమయంలో బెంగాల్ ఆటగాడు రాబి హన్సదా(94వ నిమిషంలో) గోల్ కొట్టాడు. టోర్నీ సుదీర్ఘ చరిత్రలో అత్యధిక సార్లు ట్రోఫీ గెలిచిన జట్టుగా బెంగాల్ సరికొత్త రికార్డు నెలకొల్పింది.



## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్..



**బలగం టీవీ, సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మంగళవారం హైదరాబాదులోని సీఎం నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు అంశాలపై చర్చించారు .ఇక్కడ కరీం నగర్ గ్రంధాలయ చైర్మన్ సత్తు మల్లేశం ఉన్నారు..

## డీటీఓ కాట్నపల్లి నీరజ సేవలు మరువలేనివి..



- **అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**బలగం టీవీ, సిరిసిల్ల**

డిస్ట్రిక్ట్ ట్రెజరీ అధికారి (డీటీఓ)గా కాట్నపల్లి నీరజ సేవలు మరువలేనివని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు . మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో డీటీఓ కాట్నపల్లి నీరజ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆదనపు కలెక్టర్ హాజరై మాట్లాడుతూ కాట్నపల్లి నీరజ ట్రెజరీ శాఖలో దాదాపు 38 ఏండ్ల క్రితం జూనియర్ అకౌంటెంట్ నుంచి తన సేవలు మొదలు పెట్టి, అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారని వివరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జనవరి 20 వ తేదీ 2021 నుంచి డిసెంబర్ 31 వ తేదీ 2024 వరకు సేవలు అందించారని పేర్కొన్నారు. ఇక్కడ ఆయా శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం వితరణ

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన ఒకడు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి మృతిచెందగా వారి కుటుంబానికి అండగా ఉండేందుకు అమ్మ ఫౌండేషన్ నిర్వాహకుడు ఆకుల మురళి వారి కుటుంబానికి బియ్యం వితరణ చేసి అండగా నిలిచాడు.గ్రామంలో శాతవాహన కాలానికి చెందిన పుట్టి కాశయ్య గత కొద్ది రోజుల క్రితం మృతిచెందడంతో తన భార్య పుట్టి రేణుక వారి చిన్న పిల్లల పరిస్థితి అర్థం చేసుకొని ఆ చెల్లెకు ఎంతో కొంత ఆసరాగా 50 కిలోల సన్న బియ్యం వితరణ చేసిన తన ఔదార్యం చాటుకున్నారు.వారి కుటుంబానికి ఆపతిలో ఆదుకునేందుకు నేనున్నానని ధైర్యం భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలోఆకుల ప్రవీణ్ గౌడ్,పాటిదేవయ్య, చీకట్లసతీష్, గడ్డమీదిసాయి చంద్, పాశంరామకృష్ణ, బడేదేవేందర్, పాశం ప్రశాంత్ పాల్గొన్నారు.

## కుంభమేళాకు 8 ప్రత్యేక రైళ్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉత్తరప్రదేశ్‌లో జరిగే మహా కుంభమేళాకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి వెళ్లే భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త అందించింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వివిధ స్టేషన్ల నుంచి మరో 8 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించారు. ఇందులో నాలుగు ప్రత్యేక రైళ్లు ఉండగా, మరో నాలుగు ప్రత్యేక రైళ్ల సర్వీసును పొడిగించారు. మంగళూరు సెంట్రల్ - వారణాసి. (రైలు నెం. 06020), వారణాసి - మంగళూరు సెంట్రల్. (రైలు నెం. 06020), చెన్నై సెంట్రల్ - గోమతినగర్ (రైలు నెం. 06071), గోమతినగర్ - చెన్నై సెంట్రల్ (రైలు నెం. 06072) సర్వీసులను ఏర్పాటు చేసింది.

ఈ ప్రత్యేక రైళ్ల పొడిగింపు.. షోలాపూర్ - ముంబయి (రైలు నెం. 01435) జనవరి 7వ తేదీ నుంచి మార్చి 25 వరకు ప్రతి మంగళవారం ముంబయి - షోలాపూర్ (రైలు నెం. 01436) జనవరి 1 నుంచి మార్చి 26 వరకు ప్రతి బుధవారం. షోలాపూర్ - తిరుపతి (రైలు నెం. 01437) జనవరి 2 నుంచి మార్చి 27 వరకు ప్రతి గురువారం, తిరుపతి - షోలాపూర్ (రైలు నెం. 01438) జనవరి 3 నుంచి మార్చి 28 వరకు ప్రతి శుక్రవారం అందుబాటులో ఉండనుంది.

# నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టురట్టు..

- **నకిలీ డాక్యుమెంట్లు, స్టాంప్‌లు డాక్యుమెంట్లు తయారీ చేసే సామగ్రి స్వాధీనం.**
- **ఐదుగురు నిందుతులు అరెస్ట్, రిమాండ్ కి తరలింపు**

**ఎస్పీ అఖిల్ మహాజన్.**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్లలో నకిలీ సర్టిఫికెట్ల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి నకిలీ డాక్యుమెంట్లు, నాలుగు సెల్ ఫోన్లు,స్టాంప్ లు డాక్యుమెంట్లు తయారీ చేసే సామగ్రి స్వాధీనం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో నకిలీ సూరిటీ సర్టిఫికెట్ పెట్టుకొని రిమాండ్ అయిన కేసులో బెయిల్ వచ్చేలా చేయగా దానిపై విచారణ చేయగా సిరిసిల్ల పట్టణ పరిధిలోని గాంధీనగర్ కి చెందిన సిరిపురం చంద్రమౌళి రిటైర్డ్ టీచర్ కొన్ని నకిలీ స్టాంపుల తాసిల్దార్ బోయినపల్లి, సివిల్ అసిస్టెంట్ సర్జన్,గ్రామ పంచాయతీ సెక్రటరీ పేరుతో ,కొంత మంది వీఐపీల పేరుతో సర్టిఫికెట్లు తయారు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆఫీసుల నుండి జారీ చేసే సర్టిఫికెట్లు,కోర్టులో బెయిల్ కొరకు సూరిటీగా ఇచ్చే ప్రాపర్టీ వాల్యూయేషన్ సర్టిఫికెట్లు, ప్రభుత్వ ఆఫీసుల నుండి ఇచ్చే ఏజీ సర్టిఫికెట్లు, ప్రభుత్వ స్కూళ్లలో నుండి ఇచ్చే డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్లు,ఆసుపత్రుల నుండే ఇచ్చే వివిద మెడికల్ సర్టిఫికెట్లు,కల్యాణ లక్ష్మి పొందడానికి నకిలీ అర్హత పత్రాలు, విఐపి లు ఇచ్చే లెటర్ ప్యాడ్ లు,అర్హత లేని వారికి మరియు సంబంధిత పత్రాలను సమర్పించలేని వారికి పై ఆఫీసులలో నుండి సర్టిఫికెట్లు పొందలేని వారికి నకిలీ సర్టిఫికెట్లను తయారు చేసి వాటిని సంబదిత ప్రభుత్వ ఆఫీసులలో సమర్పించి ప్రభుత్వాన్ని, ప్రజలను మోసం చేస్తున్నరానిఅన్నారు. ఇట్టి విషయం తెలియగానే చంద్ర మౌళి ని అదుపులోకి తీసుకని విచారించగా ప్రకాష్, శివాజీ,రాజేష్ సహకరిస్తున్నారని,చందుర్తి మండలం ఆనంతపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ వీరి వద్ద నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్ పొంది లబ్ధి పొందారని,విష్ణు అనే వ్యక్తి వీరి వద్ద నకిలీ వాల్యువేషన్ సర్టిఫికెట్ తీసుకొని ఇతరులకు ఇవ్వడం జరిగిందన్నారు.ఇట్టి కేసుపై లోతుగా విచారం చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సిరిపురం చంద్ర మౌళి,పోలు ప్రకాష్,బొడ్డు శివాజీ,చిలుక బాబు మరియు బిట్ల విష్ణు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని,శిలం రాజేష్ పరారీలో ఉన్నాడని త్వరలోనే పట్టుకుంటామని అన్నారు.వారి వద్దనుండి 06 స్టాంపులు, నకిలీ డాక్యుమెంట్ లు, స్టాంపులు,11 ఇంటి విలువ గల ధృవీకరణ పత్రాలు,6 పెన్నులు,1 భూతద్దం, 4 సెల్ ఫోన్ లు ,2 స్టాంప్ పాడ్స్ ,పాలీ స్టాంపర్ స్టాంపులు తయారు చేసే మిషన్ ,31 స్టాంపు ముట్టీలు, రెండు వైపుల అంటించే స్టాంప్ షీట్లు ,సిలికాన్ షీట్ ,ఒక స్టాంప్ సొల్యూషన్ కెమికల్ గల నలుపు రంగు డబ్బా స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ కృష్ణ, టాస్కోర్స్ సి.ఐ సదన్ కుమార్,టాస్కోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులకు ఆర్థిక సహాయం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఆదిలాబాద్ జిల్లా స్పోర్ట్స్ స్కూల్ కు సంబంధించిన విద్యార్థులు ఇటీవల హైదరాబాద్ లోని జూడో క్రీడాలో గోల్డ్ మెడల్ సాధించారు. వీరికి రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఉన్నటువంటి అశ్విని హాస్పిటల్ చైర్పర్సన్ గోవర్ధనం సత్యనారాయణ స్వామి దిరావత్ సునీత,-40,గోల్డ్ మెడల్, సపవతి రమ్య -48,గోల్డ్ మెడల్, రమావత్ చాందిని -52,గోల్డ్ మెడల్, మచ్చ ఉషశ్విని -40, సిల్వర్ మెడల్, దేవుళ్ళ ఝాన్సీ -57, గోల్డ్ మెడల్ ఒక్కొక్క విద్యార్థికి గోల్డ్ మెడల్ సత్కరించి ?2,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ స్వామి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల నెరవేస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. క్రీడలో గోల్డ్ మెడల్ సాధిస్తున్న



విద్యార్థులను తల్లిదండ్రులు సంతోషపడి ప్రోత్సహించాలని అన్నారు. క్రీడలతో మానసిక ఆలోచనలు దూరం చేస్తూ జ్ఞానాన్ని పెంపొందుతుంది అన్నారు. ప్రతి విద్యార్థి చెడు అలవాట్లకు దూరం ఉంటూ విద్య పట్ల శ్రద్ధతో చదివినట్లయితే డాక్టర్లు, ఇంజనీర్లు మరెన్నో ఉద్యోగాలు సాధిస్తారని అన్నారు. విద్యార్థులకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్‌ఓబి నిధులు మంజూరు

**బలగం టీవీ, హైదరాబాద్**

నిజామాబాద్ జిల్లాలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణంకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విధుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వం అడవి మామిడి పల్లి అర్‌ఓఆర్ కు రూ.3.20 కోట్లు, అర్సపల్లి ఆర్‌ఓఆర్ కు రూ.4.7 కోట్లు, మాదవ నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు సుమారు రూ.6 కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ నెల 22న నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ స్వయంగా సీఎం రేవంత్ ని కలిసి జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలని కోరిన విషయం తెలిసిందే. నిజామాబాద్ జిల్లాలోని అడవి మామిడి పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జీ నిర్మాణం మొత్తం రైల్వే నిధులతో, మాదవ నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా, అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జీ కేంద్ర నిధులతో జరుగుతున్నాయి.

## 2024లో ప్రభుత్వ పరంగా వైఫల్యాలే ఎక్కువ : ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర ప్రజలకు దేశ విదేశాల్లో స్థిరపడ్డ తెలంగాణ బిడ్డలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 2024లో ప్రభుత్వ పరంగా ఎందులో చూసినా విజయాల కన్నా.. వైఫల్యాలే ఎక్కువగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ?ఎన్నికల సమయంలో ప్రజలకు కోటి ఆశలు చూపిన కాంగ్రెస్ పార్టీ.. ఏట్లో రాయి కాదు, కనీసం కూట్లో రాయి కూడా తీయలేదు అని హరీశ్‌రావు విమర్శించారు. అభయ హస్తం ప్రజలను భయ పెట్టే, భాధ పెట్టే హస్తంగా మారింది. వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారంటీలు 390 రోజులు గడిచినా మొదలు కాలేదు. గ్యారంటీలు అమలు చేయమంటే గారడీల విన్యాసం చేస్తున్నారు. ఏడాది పాలన తర్వాత అనేక సర్వే ఏజెన్సీలు ప్రజల మూడ్ తెలుసుకునే ప్రయత్నాలు చేశాయి. ?ఏ సర్వేలో కూడా రేవంత్‌కు పాస్ మార్కులు కూడా రాలేదు. ఎవరిని అడిగినా రేవంత్‌ను తిడుతున్నరు అనే సమాధానం వస్తోంది. డిక్లరేషన్లు అమలు చేసే బదులు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. ప్రశ్నిస్తే పగబడుతున్నారు.. పాలసీ ఏదీ అంటే పోలీసులను పంపుతున్నారు. కిట్ల స్థానంలో కాంగ్రెస్ మార్కు తిట్లు వచ్చాయ్ అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఎన్నికలప్పుడు బోనస్ మాటలు.. ఇప్పుడేమో బోగస్ మాటలు. ఎన్నికలప్పుడు అన్ని పంటలకు బోనస్ అన్నారు.. ఇప్పుడు ఒక పంటకు మాత్రమే అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్ అవుతున్నాయి. రుణమాఫీ చివర విడత చెక్కు అని హంగామా చేశారు.. ఇంకా డబ్బులు రైతుల అకౌంట్లలోనే జమ కాలేదు. వరంగల్‌లో మహిళా సంఘాలకు ఇచ్చిన చెక్కుల డబ్బులు కూడా వారికి చేరలేదు. విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు కూడా అమలు కాలేదని హరీశ్‌రావు గుర్తు చేశారు.

బీఆర్ఎస్ నాయకులపై క్షణాల్లో కేసులు పెడుతున్న పోలీసులు.. కాంగ్రెస్ నేతలపై ఫిర్యాదుచేస్తే పట్టించుకోవడం లేదు. అన్నారు. కాంగ్రెస్ నేతలు చెప్పిందే పోలీసులు అమలు చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులకు కమీషన్ల మీద ధ్యాసే తప్ప కమిట్‌మెంట్ లేదు. కేసీఆర్ గొప్పగా నెలకొల్పిన గురుకులాలను గాలికి వొదిలేశారు. విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదు. సీఎంకు ఢిల్లీ పర్యటనల ధ్యాసే తప్ప.. గల్లీల్లో ఉన్న గురుకులాల మీద పట్టింపు లేదు అన్నారు.

# డ్రగ్స్ అవసరమా డార్లింగ్స్..

## ● న్యూ ఇయర్ వేళ ప్రభాస్ స్పెషల్ వీడియో

**బలగం టీవీ, హైదరాబాద్**

న్యూ ఇయర్ వేళ సినీ నటుడు ప్రభాస్ ప్రత్యేక వీడియో రిలీజ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరపున డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ ఒక వీడియోను విడుదల చేశారు. అందులో డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను వివరించారు.

జీవితంలో మనకు బోలెడన్నీ ఎంజాయ్మెంట్స్ ఉన్నాయని, కావల్సినంత ఎంటర్‌టైన్‌మెంట్ ఉందని, డ్రగ్స్‌కు నో చెప్పాలని పిలుపునిచ్చారు. మనల్ని ప్రేమించే, మన కోసం బతికేవాళ్లు ఉన్నప్పుడు.. జీవితాన్ని నాశనం చేసే డ్రగ్స్ అవసరమా డార్లింగ్స్ అని ప్రశ్నించారు. మాదక ద్రవ్యాలకు నో చెప్పాలని పిలుపునిచ్చారు.అంతేకాదు, మన స్నేహితులు, బంధువులు, తెలిసిన వాళ్లు ఎవరైనా డ్రగ్స్‌కు బానిసలైతే వెంటనే 87126 –71111 నెంబర్కు ఫోన్ చేయాలని ప్రభాస్ చెప్పారు.



డ్రగ్స్కు బానిసలైన వాళ్లు పూర్తిగా కోలుకునే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు.



## రామ్ చరణ్ తో బాలయ్య అన్ స్టాపబుల్

**బలగం టీవీ, హైదరాబాద్**

నందమూరి బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో అన్‌స్టాపబుల్‌కు తమ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ప్రముఖ నటులు విచ్చేసి సందడి చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా వెంకటేశ్, అనిల్ రావిపూడి, నిర్మాత సురేశ్ బాబు పాల్గొని సందడి చేశారు.

ఇక జనవరి 10న సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న 'గేమ్ ఛేంజర్' మూవీ ప్రమోషన్‌లో భాగంగా రామ్ చరణ్ అన్ స్టాపబుల్ షోకు విచ్చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై 'ఆహా' ఓటీటీ సంస్థ ఎక్స్ వేదికగా అధికారిక ప్రకటన చేసింది. 'ఒరేయ్ చిట్టి .. బాబు వస్తున్నాడు .. రీసౌండ్ ఇండియా అంతా వినిపించేలా చేయండి' అంటూ

## రాజ్ తరుణ్ కొత్త చిత్రం..

**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్ హీరో రాజ్ తరుణ్ 2024 లో నటించిన పురుషోత్తముడు, తిరగబడరా సామీ, భలే ఉన్నాడే చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర విజయాన్ని అందుకోలేకపోయాయి. దీంతో ఇక తన నెక్స్ట్ మూవీతో ఎలాగైనా కమ్‌బ్యాక్ ఇవ్వాలని రాజ్ తరుణ్ ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే తన నెక్స్ట్ మూవీగా ఓ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. రమేష్ కడుముల డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా ఫస్ట్ లుక్‌తో పాటు టైటిల్‌ను న్యూ ఇయర్ కానుకగా జనవరి 1న మధ్యాహ్నం 3.33 గంటలకు రివీల్ చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సినిమాలో రాశి సింగ్ హీరోయిన్‌గా నటిస్తోంది. శేఖర్ చంద్ర సంగీతం అందిస్తున్న ఈ సినిమాను కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్‌పి బ్యానర్ ప్రొడ్యూస్ చేస్తుంది.



## ఐకానిక్ రోల్స్‌తో వెంకీ న్యూ ఇయర్ ట్రీట్

**బలగం టీవీ, హైదరాబాద్**

విక్టరీ వెంకటేష్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం' దర్శకుడు అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం నుంచి ఇప్పటివరకు రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఆడియెన్స్‌ను ఆకట్టుకోవడంలో సక్సెస్ అయ్యింది. ఇదిలా ఉండగా, ఈ సినిమా నుంచి న్యూ ఇయర్ కానుకగా ఓ ట్రీట్ ఇవ్వబోతున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది.వెంకీ కెరీర్‌లో ఐకానిక్ చిత్రాల్లోని కొన్ని గెటప్స్‌తో ఓ ట్రీట్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. 'చంటి' నుంచి చంటి.. 'బొబ్బిలి రాజా' నుంచి రాజా.. 'జయం మనదేరా' నుంచి మహా దేవ నాయుడు.. 'ఘర్షణ' నుంచి డిసిపి రామచంద్ర పాత్రలు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాయని చిత్ర యూనిట్ తెలిపింది.



## సమంత వల్లే నాకు ఆ ఆవకాశం

### ● కీర్తి సురేశ్

**బలగం టీవీ, హైదరాబాద్**

'మహానటి' సినిమాతో తెలుగుతోపాటు తమిళంలోనూ ఫేం సంపాదించుకున్న కీర్తి సురేశ్ వరుస చిత్రాలతో బిజీగా మారిపోయింది. ఇటీవలే బాలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. వరుణ్ ధావన్‌తో కలిసి 'బేబీ జాన్' చిత్రంలో నటించింది. ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ క్రమంలో 'బేబీ జాన్' చిత్రంలో అవకాశం గురించి మహానటి తాజాగా ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టింది. స్టార్ నటి సమంత కారణంగానే తనకు 'బేబీ జాన్'చిత్రంలో నటించే గొప్ప అవకాశం వచ్చిందని సంతోషం వ్యక్తం చేసింది. ఈ మేరకు సామ్‌కు థ్యాంక్స్ చెప్పింది. 'బేబీ జాన్' చిత్రం 'తెరి' సినిమాకు రీమేక్‌గా రూపొందించిన విషయం తెలిసిందే. దీని తమిళ వెర్షన్‌లో హీరోయిన్‌గా సామ్ నటించింది. ఈ చిత్రం హిందీ రీమేక్ చేయాలని భావించిన చిత్ర బృందం సమంతను సంప్రదించగా.. సామ్ తన పేరును సూచించిందని కీర్తి సురేశ్ తాజాగా వెల్లడించింది. తమిళంలో సమంత పోషించిన పాత్రను హిందీలో తాను చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపింది. ఈ సినిమాతో బాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభూతి అని పేర్కొంది. ఈ సినిమా కోసం సమంత తన పేరు చెప్పగానే తాను భయపడ్డానని అయితే సమంత తనకు ఎంతో మద్దతు ఇచ్చిందని పేర్కొంది. సమంత ఇచ్చిన ధైర్యంతోనే సినిమాను పూర్తి చేశానని చెప్పుకొచ్చింది. ఈ విషయంలో సమంతకు కీర్తి సురేశ్ కృతజ్ఞతలు తెలిపింది.




## జైస్వాల్ ఔట్‌పై వివాదం

**బలగం టీవీ, హైదరాబాద్**

మెల్‌బోర్న్ బాక్సింగ్ డే టెస్టులో రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ జైస్వాల్ ఔట్‌పై వివాదం నెలకొన్నది. కమిన్స్ బౌలింగ్‌లో కీపర్ క్యారీ క్యాచ్‌పై థర్డ్ అంపైర్ సైకత్ షర్ఫుదుల్లా నిర్ణయం దీనికి కారణమైంది. డ్రా కోసం ఆడుతున్న సమయంలో జైస్వాల్ క్యాచ్‌పై ఆన్‌ఫీల్డ్ అంపైర్ విల్సన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆసీస్ డీఆర్ఎస్‌కు వెళ్లింది. పలుమార్లు పరిశీలించిన అంపైర్ సైకత్..బంతి బ్యాట్‌ను తాకినట్లు స్నికోమీటర్‌లో కనిపించకపోయినా ఔట్ అని ప్రకటించాడు. ఈ నిర్ణయంపై జైస్వాల్ తీవ్ర అసహనం వ్యక్తంచేస్తూ మైదానాన్ని వీడాడు. స్టేడియంలో ఉన్న ప్రేక్షకులు కూడా చీటర్ చీటర్ అంటూ పెద్దగా అరిచారు.



## సిరీస్ కైవసం చేసుకున్న కివీస్


**బలగం టీవీ, హైదరాబాద్**

శ్రీలంకతో జరుగుతున్న మూడు టీ20ల సిరీస్‌లో న్యూజిలాండ్ 2–0తో సిరీస్ ను కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన రెండో టీ20 మ్యాచ్ లో శ్రీలకంపై న్యూజిలాండ్ 45 పరుగుల తేడాతో విజయం సాధించింది. బే ఓవల్ లో టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ దిగిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 186 పరుగులు చేసింది. కివీస్ బ్యాటర్లలో మార్క్ చాప్‌మన్ 29 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్ లతో 42 పరుగులు చేశాడు. ఓపెనర్ రాబిన్ సన్ 34 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్ లతో 41 పరుగులు చేశాడు. చివరల్లో వికెట్ కీపర్ మిచెల్ హెూ ధాటిగా ఆడాడు. 19 బంతుల్లో 41 పరుగులు చేసిన నాటౌట్ గా నిలిచాడు. 4 ఫోర్లు 2 సిక్స్ లో కొట్టాడు. ఫిలిప్స్ 23 పరుగులు చేయగా.. మిచెల్ 18 పరుగులు చేశాడు. లంక బౌలర్లలో హసరంగ 2 వికెట్లు పడగొట్టగా.. తుషర, పతిరన ఒక్కో వికెట్ తీశారు. 187 పరుగులు విజయలక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక 19.1 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌట్ అయింది.

మొదటగా లంక బ్యాటర్లు ధాటిగా ఆడారు. ఆ తర్వాత క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో ఓటమి పాలయ్యారు. కుశాల్ పెరారే 35 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్ లతో 48 పరుగులు చేశాడు. నిస్సాంక 28 బంతుల్లో 3 ఫోర్లు 2 సిక్స్ లతో 37 పరుగులు చేశాడు. అసలంక 27 పరుగులు చేయగా.. మిగతా వారంతా తక్కువ పరుగులకే ఔట్ అయ్యారు. కివీస్ బౌలర్లలో జాకాబ్ డుప్పీ 4 వికెట్లు తీయగా.. మ్యాట్ హెన్రీ, మిచెల్ సాంట్నర్ రెండేసి వికెట్లు పడగొట్టారు. బ్రాస్ వెల్, ఫ్లాక్స్ ఒక్కో వికెట్ తీశారు. మూడో టీ20 జనవరి 2న జరగనుంది. మొదటి టీ20లో కూడా శ్రీలంక ఓడిపోయింది. మొదటి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 8 వికెట్లకు 172 పరుగులు చేసింది. డారిల్ మిచెల్ 62, బ్రాస్ వెల్ 59 పరుగులు చేశారు. శ్రీలంక 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 164 పరుగులే చేసింది. నిస్సాంక 90 పరుగులు చేశాడు. అయినా జట్టును గెలిపించలేకపోయాడు.

## మరో వివాదంలో మంచు ఫ్యామిలీ..

**బలగం టీవీ, హైదరాబాద్**



మంచు ఫ్యామిలీ మరో వివాదంలో చిక్కుకుంది. మంచు మనోజ్, మోహన్ బాబు మధ్య జరిగిన ఆస్తి వివాదం, ఆ తర్వాత జరిగిన పరిణామాలు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల సంచలనం సృష్టించాయి. తాజాగా మంచు విష్ణు సిబ్బంది అడవి పందులను వేటాడటం ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్ జల్‌పల్లిలోని అటవీ ప్రాంతంలో మంచు విష్ణు మేనేజర్ కిరణ్ చిట్ట వేటాడిన అడవి పందిని ఎలక్ట్రీషియన్ దేవేంద్ర ప్రసాద్ బంధించి తీసుకొచ్చినట్టు వీడియోలు వైరలవుతున్నాయి.. అడవి పందిని వేటాడి తీసుకెళ్లినట్లు మేనేజర్ కిరణ్, ఎలక్ట్రీషియన్ ప్రసాద్‌పై ఇప్పటికే పలు ఆరోపణలు వచ్చాయని మంచు మనోజ్ తెలిపారు. వారిద్దరి చర్యలను తప్పుబడుతూ పలుమార్లు అభ్యంతరాలు కూడా వ్యక్తం చేశానని చెప్పారు. అయినప్పటికీ వారిద్దరూ పట్టించుకోకుండా ఇలాగే చేశారని చెప్పారు. ఇదిలా ఉంటే మంచు విష్ణు సిబ్బంది అడవి పందులను బంధించి తీసుకెళ్తున్న వీడియోలు ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. వీటిపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడవి పందులను వేటాడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.